క్లుప్తంగా

పట్టణాభివృద్ధికి సహకరించండి

నాగర్‌కర్నూల్: ఇంటి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు ఏప్రిల్ 30లోపు ముందస్తుగా చెల్లిస్తే ఇంటి పన్ను వడ్డీలో 5 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సాయినాథుడికి పూజలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని సాయినాథుడి ఆలయంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి, జటప్రోల్, రామాపురం, గోపాలపురం, జటప్రోల్ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం మంగళహారతి, గణపతిపూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఎండీ మైనుద్దీన్(45) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి గౌరారం గ్రామానికి వెళ్లి మైనుద్దీన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సల్వాది కురుమూర్తి, బిక్కుసాయిలు, బోయ మల్లయ్య, గోరటి కురుమూర్తి, గుండూరు శ్రీను, నర్సింహారెడ్డి, ఆంజనేయులు, చిన్నయ్య, కోట్రశ్, ఉస్మాన్‌పాషా, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్పీ రాక

అచ్చంపేట రూరల్: బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం అచ్చంపేటకు రానున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆర్‌ఎస్పీ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

మాలలు మద్దతు ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మాలలు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా యువ నాయకుడు గోరటి సూరి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మిద్దె బాలస్వామి, అల్వాలి శ్రీశైలం, మన్నెం, మధు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తెలకపల్లి: మండలంలోని అనంతసాగర్ గేటు వద్ద ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం నుంచి కిందపడి తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ మండలం, గన్యాగుల గ్రామానికి చెందిన మల్లయ్య మండల కేంద్రం నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో అనంతసాగర్ గేటు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధితుడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వెలగని హైమాస్ట్ లైట్లు

తాడూరు: మండల కేంద్రంలోని 2వ, 4వ వార్డులలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. నెల రోజులు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రివేళ ఆయా వార్డుల్లో అంధకారం నెలకొంది. దీంతో ప్రజలు చీకటి అవగానే బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. హైమాస్ట్ లైట్లను మరమ్మతు చేయించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హైమాస్ట్ లైట్లు వెలిగించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.





లింగాలలో..



వెల్దండలో సింగిల్‌విండో కార్యాలయంలో..



నర్సాయిపల్లిలో ..

దళారులను ఆశ్రయించొద్దు

కల్వకుర్తిరూరల్: మండలంలోని 14 గ్రామాల్లో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల్లోని కేంద్ర నిర్వాహకులు రైతులతో కలిసి ప్రారంభించారు. మండలంలోని పంజుగుల, గుండూరు, రఘుపతిపేట, మార్చాల గ్రామాలతోపాటు మరో 10 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏగ్రేడ్ రకం రూ.2203, బీ గ్రేడ్ రూ. 2183లు చెల్లిస్తుందని పీఏసీఎస్ సీఈఓ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కోడేరు: రైతులు వరిధాన్యం విక్రయించేందుకు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సింగిల్‌విండో సీఈఓ రాజు అన్నారు. గురువారం మండలంలోని నర్సాయిపల్లి, మైలారం గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మాజీ సర్పంచ్ మశన్నతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కొండల్‌రావు, ఆంజనేయులు, బాలస్వామి, వీరయ్య, మల్లేష్, అగ్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని అంతారం, ఇంద్రకల్, పాల్మూరు, తిరుమలాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల సభ్యులు ప్రారంభించారు. ఐకేపీ సిబ్బంది శేఖర్, పార్వతమ్మ, లక్ష్మణ్ ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపురంలో కొనుగోలు కేంద్రాన్ని మహిళా సంఘాల సభ్యులు ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీసీ శోభారాణి పేర్కొన్నారు. రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారిణి మంజుల ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం తీసుకొచ్చే రైతులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా నంబర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటరెడ్డి, సాదిక్, సాయిబాబు, రైతులు తదితరులు ఉన్నారు.

లింగాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి కోరారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. లింగాలతో పాటు అవుసలికుంట, అంబట్‌పల్లి, జీలుగుపల్లిలో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. డీసీసీబీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నారాయణ, సీఈఓ పాండు, ఏఈఓ మానస, రైతులు పాల్గొన్నారు.



తాడూరు మండలం అంతారంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ముస్లింల అభ్యున్నతికి కృషి



అచ్చంపేటలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు పండ్లు, స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

మన్ననూర్: పవిత్రమైన రంజాన్ పర్వదినం సందర్భంగా మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం గురువారం ఆయన నివాసంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. వివిధ కులాలు, మతస్తుల వారు హాజరయ్యారు. హలీంతో పాటు పండ్లు, తదితర అల్పాహారం అందించారు. ఎంపీటీసీ శ్రీనివాసులు, బుచ్చయ్య, వెంకటరమణ, జాఫర్ ఉసేన్, హన్మంతరెడ్డి, సత్యనారాయణ, శివాజీ, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, లోకనాథం, మధు తదితరులు రహీంలు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

కొల్లాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీపీ మాలె రజిత భాస్కర్‌గౌడ్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ఎంపీటీసీలు తాగునీరు, విద్యుత్ కోతలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్‌భగీరథ పైపులను లీకులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపు చేశారు. సమావేశంలో ఎంపీడీఓ చక్రపాణిరామ్‌తో పాటు ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రజిత భాస్కర్‌గౌడ్

ఉపాధి పనుల పరిశీలన



మల్లపల్లి తండాలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దకొత్తపల్లి: మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 1831 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని ఏపీఓ మంజుల తెలిపారు. మండలంలోని చిన్నకొత్తపల్లి కాల్వలో జమ్ము, మట్టి, చెరువుకట్టపై చెట్ల తొలగింపు పనులను ఆమె పరిశీలించారు. కూలీలకొత్తగా కూలీ వచ్చేవారు జాబ్‌కార్డు పొందిన తర్వాత కూలీ పనికి రావాలని సూచించారు. వేసవికాలం కావడంతో కూలీలకు పనులు దొరకక ఉపాధి పనులు చేసేందుకు అధిక సంఖ్యలో వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని మల్లపల్లి తండాల్లో గురువారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ ఉపాధి పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మస్టర్‌లో హాజరును నమోదు చేయాలని సూచించారు. పనులను కొలతల ప్రకారం వేతనాలు చెల్లించాలని సిబ్బందిని కోరారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, ఎఫ్ఏ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ విగ్రహ ప్రతిష్ట



తెలకపల్లి మండలం పెద్దపల్లి మండలం బుగ్గవేంకటేశ్వరస్వామి ఆలయంలో



మల్లపల్లిలో హోమం నిర్వహిస్తున్న పండితులు

చారకొండ: మండలంలోని మల్లపల్లిలో వడ్డెరుల కులదైవం ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సామూహిక హోమాలు చేశారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో మంత్రచ్ఛరణ మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా డప్పువాయిద్యాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలేరాం గౌడ్ దగ్గరుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాండు, శ్రీనయ్య, కొండల్, యాదయ్య, విష్ణు, వెంకటయ్య, సత్తయ్య, రాములు, రమేష్, సైదులు, ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి బుగ్గవేంకటేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బుగ్గవేంకటేశ్వరస్వామి బాల ఆలయంలో ప్రతిష్ఠ చేశారు. పూర్ణాహుతి, హోమం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయ కమిటీ చైర్మన్ దర్శి రాజయ్య మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజయ్యగౌడ్‌తోపాటు పెద్దపల్లి బంగారయ్య, వెంకటయ్యగౌడ్, సత్యనాలిరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

వెల్దండ: మండల కేంద్రంతో పాటు కొట్ర, కుప్పగండ్ల, పెద్దాపూర్, చెర్కూర్ తదితర గ్రామాల్లో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుటుంబ సమేతంగా వనానికి వెళ్లి వంటవార్పులు చేసుకున్నారు. పాడి పశువులను, పశుసంపదను కాపాడాలని వనదేవతను వేడుకున్నారు. కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం ఇళ్లకు తిరిగి వెళ్లారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని మొల్గరకు చెందిన గజ్జి కృష్ణయ్యగౌడ్ అక్రమంగా మద్యం తరలిస్తున్నారు. గురువారం ఉప్పునుంతల బస్‌స్టాప్ వద్ద పట్టుబడినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. ఆతని వద్ద నుంచి 12 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



కల్వకుర్తిరూరల్: మండలంలోని తోటపల్లిలో గురువారం చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి లింగం ప్రారంభించారు. వేసవికాలం దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్ స్టేజీ వద్ద గురువారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఉప్పునుంతల మండలం మర్రిపల్లి గ్రామం నుంచి గట్టుతుమ్మెన్‌కు ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు వివరాలతో తేలిందని పేర్కొన్నారు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. డ్రైవర్ సుధాకర్, యజమాని ఎండీ రఫీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం జూకొర్లు పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఉగాదికి సెలవులు ప్రకటించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఉగాది పండుగ సందర్భంగా 10వ తరగతి మూల్యాంకన కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ గోవిందరాజులు టీఎస్ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి మనమోని శేఖర్, గౌరవాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, శ్రీనివాసమూర్తి, జైపాల్‌రెడ్డి, మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెలలో నిర్వహించనున్న సదరం క్యాంపులకు స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు కొట్ర గౌతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జిల్లాలో నెలకు రెండుసార్లు సదరం సర్టిఫికెట్ అవకాశం ఇచ్చేవారని ప్రస్తుతం నెలకు ఒకసారి ఇవ్వడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఆరోపించారు.

కణతి తొలగింపు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ కడుపులో నుంచి 3.5 కిలోల కణతిని తొలగించిన ఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం చోటుచేసుకుంది. వైద్యులు వివరాల ప్రకారం మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పుష్ప కొన్ని నెలల నుంచి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఆస్పత్రి వైద్యులు పుష్పను పరీక్షించగా కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు శస్త్ర చికిత్స నిర్వహించి కణతిని తొలగించినట్లు క్యాన్సర్ స్పెషలిస్టు డా.రాజకుమార్, జనరల్ సర్జన్ డా. ఆకిలేష్ రెడ్డి ఉన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ



చారకొండ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ చిన్న హుస్సేన్ గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ హుస్సేన్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని వాహనదారులు పాటించాలన్నారు. రూ.50 వేలకు మించి నగదు, విలువైన వస్తువులను అనుమతి లేకుండా తీసుకెళ్లొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన

వీపనగండ్ల: పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. గురువారం కల్వరాలలో అధికారులు యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంతోపాటు ఎన్నికల సమయంలో జరిగే తప్పొప్పులు, అనుసరించాల్సిన పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి కురుమయ్య, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

చారకొండ: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు బాలనర్సింహా అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. మణిపూర్‌లో గిరిజనులపై దాడులు జరిగినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. రైతుబంధు, రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సమితి సభ్యులు శ్రీనివాసులు, సత్యం, మండల కార్యదర్శి ఆశోక్, శివకృష్ణ, జగన్, కుర్మయ్య, మధినారాయణ రెడ్డి, బాలయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బాలనర్సింహా

రేపు నియోజకవర్గ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికలు పురస్కరించుకొని ఈనెల 6న పట్టణంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కాటం జంబులయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్‌ఎం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయాదవ్, నాయకులు కబ్బు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, కలమూరి నిరంజన్, శంకర్‌నాయక్, భాస్కర్‌గౌడ్, హరికృష్ణ, మామిళ్లపల్లి శ్రీనివాసులు తదితరులున్నారు.

సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలి

కల్వకుర్తిరూరల్: వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ సమీపంలో మార్కెట్ గోదాంలో రాఘవేంద్ర పారాబాయిల్డ్ మిల్లుకు సంబంధించిన 15 వేల బస్తాల ధాన్యం చోరీ అయిందని ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు రమేశ్‌బాబు గురువారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని చిన్నంబావి, బల్మూర్, కోడేరు గ్రామాల్లోని గోదాంలలోనూ ధాన్యం చోరీ అయిందని పేర్కొన్నారు. దాదాపు రూ.కోటి 30 లక్షలు విలువైన ధాన్యం చోరీ అయిందని ఈ విషయమై జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

అసంపూర్తిగా వైకుంఠధామాలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఇంద్రకల్, తుమ్మలసూర్, యత్మాపూర్ గ్రామాల్లో అసంపూర్తిగా వైకుంఠధామాలు దర్శనమిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా శ్మశాన వాటికల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఇప్పటికైనా అధికారులు వైకుంఠధామాలను పరిశీలించి అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఇంద్రకల్‌లో అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం